క్లుప్తంగా

ధనమ్మ తల్లికి పూజలు

కపిలేశ్వరపురం: కేదారిలంక గ్రామ శివారు వీధి వారిలంకలో శ్రీధనమ్మతల్లి ఆలయాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, దూరప్రాంత భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ఆసాది అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కపిలేశ్వరపురం, రావులపాలెం, కొత్తపేట, అయినవల్లి మండలాల భక్తులు అమ్మవారికి పూజలు చేశారు.

శిథిలావస్థలో వట్రపూడి వంతెన



వట్రపూడిలో శిథిలావస్థకు చేరిన వంతెన

కె.గంగవరం: మండలంలోని అద్దంపల్లి–వట్రపూడి రహదారిలోని వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ రహదారిలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తూ, అటు కాజులూరు మండలం, ఇటు కె.గంగవరం మండలం, ద్రాక్షారామకు చేరుకుంటారు. వంతెన శిథిలావస్థకు చేరడంతో పాటు, ఇరువైపులా రక్షణ గోడలు కూడా లేవు. దీంతో వంతెన ప్రమాదభరితంగా మారిందని, కొన్నిసార్లు ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోడిపందేలు ఆడుతున్న నలుగురిపై కేసు

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరం గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురుని శనివారం అదుపులోకి తీసుకున్నట్టు ఆదివారం రూరల్ పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రెండు పందెం కోళ్లు, నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై వి.కిశోర్ తెలిపారు.

కళాశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత



దాతను సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

కె.గంగవరం: పామర్రు గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆదివారం దాత సౌండ్ సిస్టమ్ బహూకరించారు. కూళ్ల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిట్టూరి రామమోహన్‌రావు కాలేజీకి రూ.18 వేల విలువైన సౌండ్ సిస్టమ్‌ను అందించారు. ఈ సందర్భంగా కాలేజీ అధ్యాపకులు, ప్రిన్సిపాల్ కలిసి దాత చిట్టూరి రామమోహన్‌రావును శాలువా, పూల దండలతో సత్కరించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు, ప్రతి రోజూ అసెంబ్లీ నిర్వహణకు ఈ సౌండ్ సిస్టమ్‌ను ఉపయోగించాలని దాత కోరారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి, విలువైన సౌండ్ సిస్టమ్‌ను అందించిన దాతను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నవోదయ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

కొత్తపేట: నవోదయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆత్రేయపురం మండలం ర్యాలి అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. ప్రముఖ మనస్తత్వవేత్త, ర్యాలి మండల ప్రజా పరిషత్ ప్రధాన ఫౌండేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యాంకుమార్ స్థానిక మ్యాజిక్ హౌస్‌లో శిక్షణ ప్రారంభించారు. చిన్నారులకు చేతివేళ్లతో లెక్కలను క్షణాల్లో ఎలా వేయవచ్చో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన పిల్లల కోసం పెద్దాపురంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ నవోదయ విద్యాలయం ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తున్న విషయం తెలిసిందే. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులకు ఉచిత విద్య వారి ఉన్నత శిఖరాలకు దోహదపడుతుంది. డిసెంబరు 13 నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఈ నెల 13 వరకు దరఖాస్తులకు గడువు ఉంది. శ్యామ్ వద్ద శిక్షణ పొందిన వారిలో 9 మంది నవోదయకు ఎంపికయ్యారు.

కాంగ్రెస్ నేతలపై భౌతిక దాడులు తగవు

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులపై టీడీపీ అనుచరులు తరచూ దాడులకు దిగడం సరైంది కాదని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు ఖండించారు. ఇటీవల పలమనేరు, కుప్పం నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్లు బి.శివశంకర్, ఆవుల గోపి, ఎంపీటీసీ అభ్యర్థి గీతపై భౌతిక దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో దాడుల ఘటనకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కుప్పం ఎంపీటీసీ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న తమ పార్టీ అభ్యర్థిని కారులో తీసుకెళుతుండగా చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.భాస్కర్‌పై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని దాడి ఘటనపై దర్యాప్తు చేయాలని కామన కోరారు.

జంక్షన్.. టెన్షన్

- బైపాస్ రోడ్డులో భయం.. భయం
- పసలపూడి వై.జంక్షన్ వద్ద అయోమయ పరిస్థితి
- ఆందోళనకర పరిస్థితుల్లో వాహనదారుల ప్రయాణం
- అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణి

రామచంద్రపురం: ఎదురుగా వాహనం వస్తుంది.. అది ఎటు వెళుతుందో తెలియని ఆందోళన. ఎదురుగా రెండు మార్గాలు.. ఏ దారిలో వెళ్లాలన్నా భయమే.. ఇదీ రామచంద్రపురం పట్టణం దాటాక పసలపూడి సమీపంలోని బైపాస్ రోడ్డు జంక్షన్ పరిస్థితి. పట్టణానికి వచ్చే రెండు మార్గాల్లోనూ బైపాస్ రోడ్డు జంక్షన్లు ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి. మండపేట రోడ్డులోని పసలపూడి వద్ద, కాకినాడ రోడ్డులోని చోడవరం వద్ద ఉన్న బైపాస్ రోడ్డు జంక్షన్ల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి బైపాస్ రోడ్డు నిర్మించినా.. ప్రధాన జంక్షన్ల వద్ద కనీస భద్రత చర్యలు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం.. వాహన దారులకు శాపంగా పరిణమించింది.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు 2007లో రూ.9 కోట్ల నిధులతో బైపాస్ రోడ్డు నిర్మాణమైంది. రాయవరం మండలం పసలపూడి జంక్షన్ నుంచి రామచంద్రపురం మండలంలోని చోడవరం వరకూ 4.6 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ అధికారులు బైపాస్ రోడ్డు నిర్మించారు. దీనిని మండపేట–రామచంద్రపురం రోడ్డుకు అనుసంధానం చేసి, పసలపూడి, చోడవరం వద్ద బైపాస్ రోడ్డు జంక్షన్లు ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా, ఆయా జంక్షన్ల వద్ద డివైడర్లు, విద్యుద్దీపాలు, ప్రమాద హెచ్చరిక బోర్డులు కానీ ఏర్పాటు చేయలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండపేట వైపు నుంచి కాకినాడ వెళ్లే వాహనదారులు నేరుగా బైపాస్ రోడ్డులోకి ప్రవేశించే వీలుండగా, రామచంద్రపురం వైపు వెళ్లేవారు పసలపూడి జంక్షన్ వద్దకు వచ్చేసరికి అయోమయానికి గురవుతున్నారు. రామచంద్రపురం రోడ్డులోంచి వచ్చే వాహనదారుల మధ్య సమన్వయం కొరవడుతోంది. ఈ క్రమంలో తరచూ ఇక్కడ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చోడవరం జంక్షన్ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్ర తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రిళ్లు ఆందోళనకరంగా..

ఇలాఉండగా రాత్రిళ్లు ఇక్కడ పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసలపూడి జంక్షన్ వద్ద డివైడర్ రింగును ఏర్పాటు చేసేందుకు గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. దీనికోసం రూ.15 లక్షలు మంజూరైనట్టు ఆ శాఖ అధికారులు అప్పట్లో వెల్లడించారు. నిధులు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నా, ఇప్పటి వరకు ఆ దిశగా పనులు చేపట్టలేదు. చోడవరం జంక్షన్ వద్ద డివైడర్ రింగును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని చెబుతున్న ఆ శాఖ అధికారులు, అక్కడ కూడా ఎటువంటి భద్రత చర్యలను తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా జంక్షన్ల వద్ద డివైడర్లు, విద్యుద్దీపాలు, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి, తాత్కాలికంగానైనా ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఆందోళనకరంగా ఉన్న రామచంద్రపురం-పసలపూడి బైపాస్ రోడ్డు వై.జంక్షన్

జంక్షన్ల వద్ద అయోమయం



పసలపూడి బైపాస్ జంక్షన్ వద్ద మండపేట నుంచి వచ్చే వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనం ఎటువైపు వెళుతుందో తెలియడం లేదు. దీంతో ద్విచక్రవాహనదారులతో పాటు, భారీ వాహనాలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– కట్టా నాగేశ్వరరావు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, రామచంద్రపురం

అధికారులు చొరవ చూపాలి



బైపాస్ రోడ్డు వద్ద వాహనాలను నియంత్రించేందుకు అధికారులు త్వరతగతిని చొరవ చూపాలి. చాలా కాలంగా ప్రమాదాలు జరుగుతున్నా, వాటి నివారణకు చర్యలు లేవు. ఇప్పటికైనా రెండు జంక్షన్ల వద్ద రింగ్‌లను ఏర్పాటు చేసి, ఏ రోడ్డుకారోడ్డు డివైడర్లు వేస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండవు.

– కొట్టువాడ హరిబాబు, బీజేపీ నాయకుడు, రామచంద్రపురం

ఎండ వేడితో ఉక్కిరిబిక్కిరి

కె.గంగవరం: రుతు పవనాలు ఈ ఏడాది దోబూచులాడుతుండడంతో ప్రస్తుతం వింత వాతావరణం నెలకొంది. విస్తారంగా వర్షాలు కురవాల్సిన సమయంలో.. అధిక ఉష్ణోగ్రతలతో ఎండలు విజృంభిస్తున్నాయి. వారం క్రితం రెండు రోజుల పాటు కురిసిన వర్షాలు.. ఇప్పుడు జాడ లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండలు మండుతుండడంతో.. అటు ప్రజలు, ఇటు వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు రోజులుగా నియోజకవర్గంలో అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో పలు గ్రామాల్లో జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. గతంలో ఎన్నడు లేని విధంగా ఎండలు విజృంభించడంతో బయటకు రావాలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. దీనికి తోడు వడగాడ్పులు, ఎండ వేడికి గ్రామాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఎండ వేడికి అపసోపాలు పడుతున్నారు. ఎండ తాపం నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. కూల్ డ్రింక్ షాపులు, జ్యూస్ సెంటర్లు, కొబ్బరి బోండాల వద్ద జనం సందడి కనిపిస్తోంది.



నిర్మానుష్యంగా ఉన్న కె.గంగవరం ప్రధాన రహదారి

రాష్ట్రంలో 'కూటమి' నిరంకుశ పాలన

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని జగన్నాథగిరి, తర్లంపూడి తదితర గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, ఇతర నాయకులు ఇంటింటా పర్యటించారు. ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఇంటింటికీ వచ్చి బాండ్ల రూపంలో ఇచ్చిన హామీలు, ప్రస్తుతం ఆ పథకాలు అమలవుతున్న తీరు, ప్రజలకు పాలకులు చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, కూటమి ఏడాది పాలనలో ప్రజల్లో స్పష్టమైన వ్యతిరేకత కనిపిస్తుందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రజలు ఎదురు తిరిగే పరిస్థితులు వచ్చాయన్నారు. కూటమి కుట్రపూరిత పాలనను ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కార్యకర్తలకు నిర్దేశించారు. ఎన్నికల వాగ్దానాలను అమలు చేయకుండా, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతూ చంద్రబాబు కక్షపూరిత పాలన సాగిస్తున్నట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పచ్చి అబద్ధాల కోరని, మోసం చేసిన కూటమి సర్కారు రాష్ట్రాన్ని పాలించే అర్హత కోల్పోయిందన్నారు. సుపరిపాలన తొలి అడుగు అంటే.. ఏంటో ఒక్కసారి చెప్పగలరా అని ప్రశ్నించారు. అసలు ఏడాది కాలంలో ఏ చేశారని సుపరిపాలన అంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగన్నాథగిరిలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

'అన్నదాత సుఖీభవ'లో కూటమి పక్షపాతం

పి.గన్నవరం: అన్నదాత సుఖీభవ పథకం అమలులో కూటమి ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబించిందని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆరోపించారు. ముంగండలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలకు సంబంధించిన రైతులకు మాత్రమే పథకాన్ని అమలు చేశారని, చాలా మంది రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. ఈ పథకం కింద రైతులకు అరకొరగా మాత్రమే సొమ్ము వేస్తున్నారని విమర్శించారు. ప్రతి రైతుకు సాయం అందేవరకూ ప్రభుత్వంపై పోరాటం సాగిస్తామన్నారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక మాటున కూటమి నాయకులు రూ.వేల కోట్లు దోచుకున్నారన్నారు. చంద్రబాబు రాష్ట్రానికి సంపద సృష్టిస్తానని చెబితే ప్రజలు నిజమేనని అనుకున్నారని, తీరా చూసేసరికి ఆ సంపదను కూటమి నాయకులకే సృష్టించుకున్నారని విమర్శించారు. కూటమి నేతలు ఎక్కడికక్కడ ఇసుకను డంపింగ్ చేసి, గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్కువ రేట్లకు అమ్ముకుంటూ ప్రజలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు అమలు చేసేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని గన్నవరపు అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, నాయకులు మందపాటి కిరణ్ కుమార్, వాసంశెట్టి తాతాజీ, పితాని నర్సింహారావు, కుసుమ వెంకటేశ్వరరావు, బొక్కా ఏడుకొండలు, ఉలిశెట్టి బాబీ, సాయిబాబు, దొమ్మేటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కర యాత్రికుడికి ఘన సత్కారం

అలమూరు: గ్రామ శివారు దేవీ కాలనీకి చెందిన నిత్య యాత్రికుడు తలశిల సాయి నరేంద్ర (చౌక దే)కు ఆదివారం ఘన సత్కారం జరిగింది. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని దేశ భూభాగమైన మనా గ్రామంలో నిర్వహించిన సరస్వతి పుష్కరాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లి క్షేమంగా తిరిగివచ్చిన చౌక దేకు మండలంలోని చొప్పెల్లలో కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన 11 పుష్కరాలకు తన మోటార్ బైక్‌పై వెళ్లి పుణ్యస్నానం చేసినట్లు యాత్రికుడు చౌక దే తెలిపారు. భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ దేశ ప్రతిష్టను ఇనుమడింప జేసే విధంగా యాత్రలు చేపట్టిన చౌక దేను పలువురు భక్తులు అభినందించారు. యలమంచిలి బుచ్చిరాజు, పిల్లా నారాయణమూర్తి, సుంకర మురళి, కొత్తూరు పెదకాపు, బళ్ల బాబి, మురకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్‌షిప్ డే



రాయవరంలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్ కట్టుకుంటున్న చిన్నారులు



ఆత్మీయ సమ్మేళనంలో 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రాయవరం: సృష్టిలో తీయనైనది స్నేహం.. ఆ స్నేహానికి గుర్తుగా జరుపుకునే ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి పలువురు తమ స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో యువతీ యువకులు తమ స్నేహితులతో కలిసి ఉత్సాహంగా సందడి చేశారు. పలువురు స్నేహితులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకుని స్నేహానికి గుర్తుగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు. అనంతరం ఒకరికొకరు కానుకలు అందజేసుకున్నారు. మండలంలో పలుచోట్ల చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా స్నేహబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.

సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు

ఇప్పుడు చాలామంది సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. సెల్‌ఫోన్లలోని వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం ద్వారా పలువురు తమ స్నేహితులకు మెసేజ్‌లు పంపించారు. పలువురు స్నేహానికి కొత్త నిర్వచనాలు, కొటేషన్లు, వీడియోల రూపంలో ఆకర్షణీయంగా రూపొందించిన మెసేజ్‌లను పంపుకున్నారు.

స్నేహితుల ఆత్మీయ కలయిక

కపిలేశ్వరపురం (మండపేట): అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మండపేట మండలం ఏడిద సీతానగరం వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులంతా సమావేశమై చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో ఎవరికి వారు స్థిరపడిన విధానాలను వివరించుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుంటూ సంబరపడ్డారు. బాల్యంలోని విశేషాలను ముచ్చటించుకున్నారు. ఆత్మీయ కలయికను పదిలపర్చుకునేందుకు గ్రూప్ ఫొటో దిగారు.

కష్టాల కాలువలో సాగుతూ..

- సాగుకు నీరందక అన్నదాతల అవస్థలు
- వర్షాల కోసం ఎదురుచూపులు
- పంట నష్టం తప్పదంటూ ఆవేదన

కాజులూరు: ఖరీఫ్ సీజన్ ఈ ఏడాది ప్రారంభ దశలోనే రైతన్నలకు కష్టాలు వెంటాడుతున్నాయి. కాలువ నుంచి నీరు సక్రమంగా పొలాలకు చేరకపోవడం, వాతావరణం అనుకూలించక వర్షాలు కురవకపోవటంతో నారుమడులు, నాట్లు వేసుకునేందుకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో అగస్టు నెల ప్రారంభమైనా.. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నేటికీ నాట్లు పడని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఎరువులు, విత్తన భారం, బ్యాంకు రుణాల మంజూరు వంటి వ్యవహారాలు రైతన్నలను తీవ్ర ఆందోళనలకు గురి చేస్తున్నాయి.

రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రాపురం, కె.గంగవరం మండలాల్లో మొత్తం 67 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సుమారు 52 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్టు వ్యవసాయాధికారుల అంచనా. నియోజకవర్గంలో వరి సాగు పూర్తిగా కాలువల నీటిపైనే ఆధారపడి ఉంది. సాధారణంగా జూన్ మాసాంతం వచ్చే సరికే నారు పెంచి, నాట్లు వేసే పనిలో బిజీగా ఉండే డెల్టా రైతులు.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా నేటికీ వరుణుడి కరుణ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. వరి సాగు తొలి దశలో నీరు ఎక్కువగా అవసరమవుతుంది. కాలువ నీరు విడుదలతో పాటు, వర్షాలూ పుష్కలంగా కురిస్తేనే తొలకరి సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం కాలువలకు నీరు అంతంతమాత్రంగా విడుదలవుతుండటంతో, శివారు భూములకు నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదు. వర్షాలు లేకపోవడంతో నారుమడులు, నాట్లు వేసిన పొలాలకు కచ్చితంగా సమృద్ధిగా నీరు కాలువల నుంచి అందుతుందో, లేదోనన్న భయాందోళనలు రైతులను వెంటాడుతున్నాయి.

చనిపోతున్న మొలకలు

వరినారు, నాట్లు వేసుకునేందుకు సాధారణంగా 26–28 డిగ్రీల సెంటీగ్రేడ్ భూ ఉష్ణోగ్రత అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఎండ వేడిమితో భూ ఉపరితలం అధికంగా వేడెక్కి ఉండటంతో నారుమడి కోసం పొలంలో చల్లిన విత్తనాలు మొలకకు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. తెగించి నారుమడులు, వెదజల్లు వేసిన పొలాలకు సాగు నీరు లేక, నేల తడారుతూ వచ్చిన మొలకలు చనిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం కొద్దో గొప్పో వర్షం పడితేనే కానీ వరినాట్లు వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

అపరాల సాగుకు ఆటంకం

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా తొలకరి సాగు ఆలస్యం కావటంతో, దీని ప్రభావం రబీ సీజన్ పైనా, ఆపై మూడో పంటగా సాగు చేసే అపరాలపైనా చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నారుమళ్లు సాగు చేసుకుని ఉంటే కనీసం ఈ నెల రెండో వారం నాటికి వరినాట్లు వేసేందుకు వీలుండేది. రుతు పవనాలు రైతన్నకు ముఖం చాటేయడం, కాలువలకు సాగునీరు విడుదల సక్రమంగా లేకపోవడం వంటి కారణాలతో ఖరీఫ్ సాగు ఆలస్యం కాక తప్పేటట్టు లేదు. ఈ నెలలోనైనా ఖరీఫ్ ప్రారంభం కాకపోతే రబీలో కూడా సాగుకు ఇబ్బందులు తప్పవని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మూడో పంటగా వేసే పెసర, మినుము వంటి అపరాల పైర్ల ఆదాయం కోల్పోవడంతో పాటు, ఖరీఫ్‌లో ఆలస్యపు సాగు కారణంగా పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ల బారిన పడాల్సి వస్తుందని రైతులు మథనపడుతున్నారు.



బందనపూడిలో సాగు నీరు లేక బీటలు వారిన పొలం



శలపాకలో పంట కాలువ దుస్థితి

ఇంజిన్లతో నీరు తోడుతున్నాం



కాలువ శివారు భూములకు సాగు నీరు అందకపోవటంతో నాట్లు వేసిన పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో పంట కాలువల్లో ఆయిల్ ఇంజిన్లు వేసి, పొలాలకు సాగు నీరు తోడుకోవాల్సి వస్తుంది. దీంతో ఆయిల్ ఇంజిన్లకు అద్దె, డీజిల్ ఖర్చులు పెరిగిపోయి రైతుకు ఆర్థిక భారం పడుతోంది.

– తలాటం వీరన్న, రైతు, కాజులూరు

వర్షాలు కురవకపోతే కష్టమే..!



ఈ సీజన్‌లో వర్షాలు కురవకపోవటంతో కాలువ నీటిపై ఆధారపడి నారు, నాట్లు వేయటం కుదరడం లేదు. తెగించి కొందరు రైతులు నాట్లు వేసినా, నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి. సాగు తొలి దశలో పరిస్థితులు ఇలా ఉంటే, సాగు ఏదోలా ముందుకు సాగినా దిగుబడి తీవ్రంగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

– సువ్వారి గోవిందు, రైతు, తర్లంపూడి

రైతులను ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



యరమాటి వెంకన్నబాబు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సాగిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రస్తుతం వంచనతో సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రమూ పోలికలేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు యరమాటి వెంకన్నబాబు అన్నారు. మండపేట పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ ప్రకటించి వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ సాయం రూ.6వేలతో కలిపి రూ.12,500 చొప్పున రైతు కుటుంబానికి ఇస్తానని ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీనిచ్చి గెలుపొందాక మరో రూ.1,000 అదనకంగా కలిపి రూ.13,500 చొప్పున అందజేసి వ్యవసాయదారులను ఆదుకున్నారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక్కో రైతు కుటుంబానికి రూ.20వేలు చొప్పున సాయం సొమ్మును ఎగ్గొట్టిందని ఆయన విమర్శించారు.

విశ్వేశ్వరస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం (మండపేట): ద్వారపూడి గ్రామంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం నూతన పాలక మండలి సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కమిటీ చైర్మన్‌గా నాగులపల్లి శ్రీలక్ష్మి, సభ్యులుగా వి.సుజాత, ఎ.లక్ష్మి, జి.రాణి, టి.శివప్రసాద్, జి.వెంకటేష్, ఎస్.వెంకటేష్, కె. శ్రీను, కె.మనిరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మర్రెడ్డి శ్రీనివాస్, నందూరి నాగబాబు, మండా వీరభద్రరావు, చేకూరి రమేష్ రాజు, చింతా దొరబాబు, యరగతపు బాబ్జి, లక్ష్మీ వీరభద్రరావు పాల్గొన్నారు.